


## *24 గంటల్లో....*

**నేను రాసిన** మొదటి చిన్న నవల 1971లో అద్దెకిచ్చిన హృదయాలు. తాజా నవల '24 గంటల్లో...'

2016లో విజయశాంతి అనే ఆమె వి - 6 ఛానల్ వాళ్ళు పెట్టే కొత్త టి.వి ఛానల్‌కి కథలకోసం నన్ను సంప్రదించారు. యూట్యూబ్‌లో ఝాన్సీరాణి, ఇదే నా న్యాయం, యమపాశంలాంటి నేను రాసిన క్రైం కథలకి ఆమె అభిమాని.




తర్వాతి సిట్టింగ్‌కి ఆమె తన వెంట కోనేటి శీను అనే దర్శకుడ్ని కూడా తెచ్చారు. వారికి నేను అనువదించిన దాదాపు పదిహేనువందల కథల్లోంచి పది ఎంపిక చేసి చెపితే అన్నీ నచ్చాయి. బడ్జెట్ దృష్ట్యా కేవలం ఓ ఇంట్లో, రోడ్లమీద, తక్కువ లొకేషన్స్‌లో, మూడు ప్రధాన పాత్రలు మించకుండా జరిగే కథలని మాత్రమే వారికి చెప్పాను. వాటిలో పదికి టెలీప్లేని రాసాను. వాటిని వి - 6 టివి ఛానల్ ఎగ్జిక్యూటివ్ శ్రీ సాయిప్రసాద్ అప్రూవ్ చేసారు. ఐతే ఎన్నికలు రావడంతో తెలంగాణ రాజకీయనాయకుడైన వి-6 అధినేత కొత్త ఛానల్‌ని తీసుకురావడం విరమించుకున్నారని ఓ రోజు విజయశాంతి చెప్పారు. ఆవిడ జి -5, మా టివి, ఈ టివి లాంటి ఛానల్స్‌లో కూడా ఈ కథల ప్రసారం కోసం ప్రయత్నించారు కానీ అనేక ప్రతికూల పరిస్థితులు ఎదురై, విసిగి విరమించుకున్నారు. ఆవిడ ఇచ్చిన పారితోషికాన్ని వెనక్కి ఇచ్చేసాను.

చాలాకాలం క్రితం నేను అమెరికాలో ఉండగా 1950ల నాటి ఓ రేడియో డ్రామా విన్నాను. కథ పేరు, రచయిత పేరు గుర్తులేవు కాని చక్కటి సస్పెన్స్‌తో సాగి, ఓ మంచి మెలికతో పూర్తయ్యే నాటకం అది. విజయశాంతిగారి కోసం బందీ అనే ఆ కథకి టెలీప్లే కూడా రాసాను. కానీ ఆ ప్రాజెక్ట్ కేన్సిల్ అవడంతో ఆ కథ ఆధారంగా పాత్రలని, సంఘటనలని, సస్పెన్స్‌ని పెంచి నవలగా రాయాలని అనుకున్నాను. దాదాపు రెండు నెలలు దానిమీద కృషి చేసి, 2019 జూన్‌లో నవలగా రాసాను కథని బట్టి '24 గంటల్లో...' సరైన పేరు అనిపించి మార్చాను.

ఓ అనుమానపు భర్త, తన భార్యని హత్యానేరంలో ఇరికించే పథకం వేస్తే అందులోంచి ఆమె ఎలా బయటపడగలిగింది? అన్నది కథాంశం. ఈ మొత్తం 24 గంటల్లో, ఎక్కువై భాగం ఆమె ఇంట్లోనే జరుగుతుంది. ఇది గతంలో నేను రాసిన యమపాశం థీమ్‌కి దగ్గరగా ఉన్నా, కథాంశం వేరు. ఇది 144 పేజీల నవలైంది. 1974లో అపరాధ పరిశోధన సప్లిమెంట్‌లో నేను రాసిన ఎర్రపెట్టె అనే మరో క్రైం నవలని కూడా ఈ పుస్తకం చివర్లో ప్రచురించాను. కారణం ఈ రెంటి థీమ్‌లో, కథాగమనంలో కొద్దిగా పోలిక ఉండటం, గత 40 ఏళ్ళుగా దాన్ని పునర్ముద్రించకపోవడం.

ప్రిజం బుక్స్ దీన్ని జులై 2019లో పుస్తకంగా ప్రచురించారు. వెల 230రూ.లు. పేజీలు 200.

ప్రస్తుతం 'కోతి బావకి పెళ్ళంటా' అనే నవల పూర్తైంది. గతంలో చెప్పినట్లు ఇది కేవలం జోక్స్‌తో సాగే సుందరి - సుబ్బారావ్ నవలకి కొనసాగింపు. డిసెంబర్ 2019లోగా ఇది పుస్తకంగా వెలువడుతుంది.

ఇంతదాకా నేను రాసిన అన్ని నవలలని ఈ శీర్షిక ద్వారా చాలా సంవత్సరాలుగా పరిచయం చేస్తూ వచ్చాను. మీరు ఎప్పుడైనా పండుని చూస్తారు. దాన్ని తింటారు. కానీ అది ఉత్పత్తి చేసిన వేరుని చూడరు. అలాగే నేను రాసిన నవలలని చదివి మీరు ఎంజాయ్ చేసారు కానీ వాటిని రాయడానికి వెనకగల శ్రమ, ఇన్స్పిరేషన్ మొదలైనవి చూడలేరు. ఇందుకు ఈ వ్యాసపరంపర మీకు అవకాశాన్ని ఇచ్చింది అని నమ్ముతున్నాను.

ప్రతీ వారి జీవితం ముగిసాక వారో కథవుతారు.

స్వాతి మంత్లీలో 'నన్ను ప్రేమించు' ఓ గొలుసు నవలని మొదలెట్టాను. ఆ ప్రేమ కథని చాలామంది రచయితలు కొనసాగించారు.

ఆంధ్రజ్యోతి డైలీలో నేను ఆరంభించిన డైలీ సీరియల్ 'హిట్,లిస్ట్'ని పోలీసుల బెదరింపు కారణంగా మధ్యలో నిలిపివేయాల్సివచ్చింది. (జరిగిన కథ పుస్తకంలో ఈ ఉదంతం చదవచ్చు) దాన్ని మూడేళ్ళక్రితం విజయనగరానికి చెందిన మంజరి అనే రచయిత నా అనుమతి తీసుకుని రాసారు. నేను అనుకున్న థీమ్‌ని, ప్రచురించని భాగాలని, క్లైమాక్స్‌ని వారికి పంపాను.

నేను రెండు నవలల్ని ఆరంభించి మధ్యలో ఆపేసాను. ఒకటి స్వాతి మంత్లీలో 'నన్ను ప్రేమించు', రెండోది ఆంధ్రభూమి వీక్లీలో వచ్చిన 'ది అపార్ట్‌మెంట్' మొదటిది ఎడిటర్ ఆపేయమని కోరారు. రెండోది నేనే ఆపేసాను.

నేను రాద్దామనుకుని రాయని కొన్ని నవలలు గురించి కూడా ఇక్కడ ప్రస్తావిస్తాను. ఒకటి, లాటరీలో కోటి రూపాయల బహుమతి పొందిన ఓ కుటుంబ పెద్ద జీవితంలో ఎదురైన అనేక సమస్యలు. అసలు లాటరీ టిక్కెట్‌నే కొనకపోతే బావుండేది అని అతను అనుకునేలా నవల ముగుస్తుంది. కానీ మనకి ఇప్పుడు లాటరీ వ్యవస్థలేదు కాబట్టి అది రాయలేదు.

1980లలో రాద్దామనుకున్న మరోటి, విడాకులు తీసుకున్న ఓ భార్య వ్యథ. పెళ్ళికి మునుపు కాల్గేట్ వాడేది. మొదటి ఉదయం భర్త వాడే ఫర్‌హాన్స్ పేస్ట్‌ని చూసి దాన్నే వాడుతుంది. విడాకులు తీసుకున్న మర్నాటి ఉదయం తిరిగి కాల్గేట్‌నే వాడుతుంది, అని ఓపెనింగ్, క్లోజింగ్ ఛాప్టర్లు అనుకున్నాను. భర్త మిత్రులంతా విడాకుల అనంతరం ఆమెకి దూరం అవడం, తన మిత్రుల్లో కొందరు తనని అవమానంగా చూడటం. 1980ల నాటి పరిస్థితి వేరు. నేటి పరిస్థితి వేరు.

మరొటి, లక్షవ ఫ్రిజ్ కొన్న వారికి ఆ కంపెనీ తమ కంపెనీ ప్రచారం కోసం పది లక్షల బహుమతిని ఇస్తుందని అక్కడ పనిచేసే ఎం.డి సెక్రటరీ తెలుసుకుని, దాన్ని తన ప్రియురాలు కొనేలా పథకం వేయడం. ఈ పూర్తి కామెడీ నవలని వార్త డైలిలో ప్రత్యూష నవల తర్వాత సీరియల్‌గా ప్రచురణకి అంగీకరించారు కూడా.

ద్వీపాల నవల. విచిత్ర ద్వీపాల్లోని వింత మనుషులు, వింత జంతువులు, వింత వృక్షాలకి చెందిన నవలని 1974లో అపరాధ పరిశోధనలో రాద్దామని అనుకున్నాను. కాని అదీ కుదరలేదు.

స్పీడ్ నవల ప్రక్రియ కింద 300 పేజీల నవలని 120-140 పేజీల్లో ముగిసే, వేగంగా సాగే నవలగా రాయాలని సంకల్పించాను. ఎడిటర్స్ కానీ, ఆనాటి నా పబ్లిషర్లు కానీ దానికి సుముఖంగా లేకపోవడంతో కుదరలేదు.

రచన మంత్లీలో 'చిరునవ్వు వెల ఎంత?' అనే నవలని రాస్తానని చెప్పాను. దాని పబ్లిసిటీ కూడా రచనలో ఇచ్చారు. కానీ కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల దాన్ని రాయలేదు. అది తెలుగు కమేడియన్ వేలు జీవితం ఆధారంగా అల్లుకున్న నవల. అప్పట్లో ఇంకా ఔత్సాహిక నటుడిగానే ఉన్న బ్రహ్మానందం ఓసారి తన గురించి చెప్పిన అంశాన్ని నవల మొదటి ఛాప్టర్‌గా అనుకున్నాను.

'నేను పుట్టక మునుపే నన్ను చంపే ప్రయత్నాలు మొదలయ్యాయి' అనే వాక్యం ఆ నవలకి మొదటి వాక్యంగా అనుకున్నాను.

తర్వాత ఈ సబ్జెక్ట్‌ని రచయిత శ్రీ ఎం.వి.వి సత్యనారాయణకి రాయమని సినాప్సిస్ చెప్పాను. రాసాననే చెప్పారు కానీ నేనా నవలని చదవలేదు.

నేను రాసిన 'అదిగో పులి'నవలని ఆంధ్రజ్యోతి వీక్లీలో సూర్యదేవర రామ్మోహనరావు, జి.వి.అమరేశ్వరావు, శాతవాహనలాంటి కొందరు రచయితలు 'షూట్ ఎట్ సైట్' పేర సీరియల్‌గా రాసారు.

డిటెక్టివ్ పృథ్వీరాజ్ హీరోగా కొమ్మూరి సాంబశివరావుగారిలా కొన్ని డిటెక్టివ్ నవలలని కూడా రాయాలని అనుకున్నాను. కానీ ఏ పత్రికా సంపాదకుడు కూడా వాటిని ప్రచురించడానికి సుముఖతని చూపలేదు. అలాగే కొమ్మూరి రాసిన నవలలని ఆధునిక కాలానికి అణుగుణంగా మార్పులు, చేర్పులు చేసి కనీసం ఓ డజను నవలలనైనా రాయాలని ఆశించాను. అలా ప్రాక్టికల్ జోకర్‌ని నవ్య వీక్లీలో రాసాక ఆ పరంపరకి ఎడిటర్స్ మోకాలడ్డారు.

'క్వీన్ విక్టోరియా' అనే కామెడి ప్రేమ నవలని కూడా రాద్దామనుకున్నాను. జంధ్యాలగారి థీమ్ చెపితే, "సినిమా తీద్దాం, పనికొస్తుంది' అన్నారు. కానీ ఆయన పోయాక అదీ కోల్డ్ స్టోరేజ్‌లో పడింది.

జానపద నవలని రాయాలనే ఉత్సాహం ఉండేది. ఏ ఎడిటరూ దాన్ని ప్రోత్సహించలేదు. వాళ్ళ లెక్కలు వాళ్ళకి ఉన్నాయి. నావి నాకున్నాయి. సస్పెన్స్‌ని ఏ కథలో కలిపినా పాఠకులు చదువుతారని నా నమ్మకం. కానీ దాన్ని ఆదిలోనే తుంచేసారు.

నవలలు కాక అనేక ఇతరపుస్తకాలని కూడా నేను ప్రచురించాను. పిల్లల పేర్ల పుస్తకం అత్యధికంగా అమ్ముడైన పుస్తకం అంటే ఆశ్చర్యం వేయచ్చు. 1990నించి నేటిదాకా రెండు లక్షల కాపీలకి పైగా పద్మాలయ, నవసాహితి, లిపి పబ్లికేషన్స్, ప్రిజమ్ బుక్స్ ప్రచురణ సంస్థలు పిల్లల పేర్ల పుస్తకాన్ని ప్రచురించాయి. యద్దనపూడి సులోచనారాణి, యండమూరి వీరేంద్రనాథ్, సూర్యదేవర రామ్మోహనరావు, ఇంకెందరో రచయితలు దీన్ని అనుసరించి పిల్లల పేర్ల పుస్తకాలని రాసారు. నవసాహితి ప్రచురణ సంస్థయితే ఏకంగా నా పిల్లల పేర్ల పుస్తకం ముఖచిత్రాన్నే శ్రీ వీరేంద్రనాథ్ పుస్తకానికి వాడారు.

జయంతి పబ్లికేషన్స్ పుస్తకాల షాపు పెరుమాళ్ళు గారు నేను ఎప్పుడు కలిసినా నన్ను చూడగానే చెప్పేవారు.

"మల్లాదిగారూ మాకు పక్షపాతం లేదు. పిల్లలపేర్ల పుస్తకాల కోసం వచ్చే వాళ్ళముందు మేం అందరి పుస్తకాలని పరుస్తాం. కానీ మీది మాత్రమే తీసుకెళ్తాంటారు."

ఇంకా వంటల పుస్తకం, టిఫిన్ వెరైటీల పుస్తకం, అనేక రకాల జోక్స్ బుక్స్, ట్రావెలాగ్స్, కృష్ణశబ్దంలాంటి సెటైరికల్ ఆర్టికల్స్ నాలుగు వాల్యూమ్స్, పిల్లల కథల పుస్తకాలు, అరడజను దాకా నా కథ సంపుటాలు, డజనుదాకా అనువాద కథల సంపుటాలు, డజను

దాకా ఆధ్యాత్మిక పుస్తకాలు, పాముల సమాచారం తెలిపే సర్పదర్శిని, సినిమాలకి సంబంధించిన పుస్తకాలు ఇలా వివిధ తరహాలకి చెందిన మరో 50కి పైగా పుస్తకాలని కూడా ప్రచురించాను.

ఇన్ని నవలలు రాసినా కొత్త నవల మొదలుపెట్టేప్పుడు, నేను మొదటి నవలని రాసినప్పుడు ఎలా ఫీలయ్యానో అలానే, అంటే 'భయం, ఇరకాటం, సరిగ్గా రాస్తున్నానా? లేదా అనేలాంటి అనుమానం' మొదలైన భావాలతో సతమతమవుతాను. నేను రాసే ఏ నవల కూడా జీవితంలా రేపేమవుతుందో, ఎలా అంతమవుతుందో తెలీకుండా ఉండటం నాకు ఇష్టం ఉండదు. అందుకనే నవల ఎలా ఆరంభమై, ఎలా సాగి ఎలా ముగుస్తుందో తెలీకుండా ఇంతదాకా ఒక్క నవల కూడా ఆరంభించలేదు.

చివరగా ఈ ఆర్టికల్స్ అన్నింటిని ప్రచురించిన శ్రీ కిరణ్‌ప్రభ, కౌముది.నెట్‌కి కృతజ్ఞతలు. భవిష్యత్‌లో రాసే కొత్త నవలల పరిచయం కూడా మీరు ఎప్పటికప్పుడు కౌముది.నెట్‌లో చదవచ్చు.

*వచ్చే సంచిక నించి 1980 - 2019 మధ్య తెలుగు నవల ఉచ్ఛ దశకి వెళ్ళి క్రమంగా క్షీణదశకి చేరడానికి గల కారణాలని, రచయితగా, ప్రచురణకర్తగా, పత్రికా ధోరణులని ఆకళింపు చేసుకున్న వ్యక్తిగా పరిశీలించిన విషయాలని కొన్ని వ్యాసాల రూపంలో మీ ముందుకు తెస్తున్నాను.*

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*

Post your comments